క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అరుణ హోమం


ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం ఆలయంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు దంపతులు సామూహికంగా అరుణ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు కోరారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


సామూహిక పారాయణం చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మాత ఆలయంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం వైభవంగా జరుపుకున్నారు. అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలువురు దంపతులు పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా వాసవీమాత పారాయణం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కొలిప్యాక శంకర్, కార్యదర్శి తాటిపెల్లి ఆదిత్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చిలువేరు వెంకటేశ్వర్, గంధం వినోద్, ముక్క సంతోశ్, సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలి

పెంచికల్‌పేట్: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీశ్ విమర్శించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తెలంగాణ ఏర్పాటయ్యాక నిధులు కేటాయించడం లేదన్నారు. వెంటనే కొత్త ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న రావి శ్రీనివాస్

బెజ్జూర్: మండల కేంద్రంలో రూ.55లక్షల ఎస్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులకు సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బుస శంకర్, యూత్ మండల అధ్యక్షుడు ఎండి హకీమ్, రాజారాం, బాబాజీ, నాయకులు పాల్గొన్నారు.

కనికిలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు సుమిత్

కౌటాల: మండలంలోని కనికి గ్రామంలో ఆదివారం కౌటాల నజరేత్ మిషన్ హస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు సుమిత్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మార్త, ప్రసన్న, శ్రీనివాస్, కిరణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధాకలి చదువులు..!

- మధ్యాహ్న భోజనానికి కళాశాల విద్యార్థుల తిప్పలు
- ఇంటి నుంచి తెచ్చుకుంటున్న వైనం
- కౌటాల కళాశాలలో 750 మంది విద్యార్థులు


తరగతి గదిలో విద్యార్థులు

కౌటాల: ఇంటర్మీడియెట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందని ద్రాక్షగానే మారింది. పాఠశాలలో మాదిరి కళాశాలల్లో కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకొని ఉన్నత చదువులకు మండల, పట్టణ కేంద్రాల్లోని కళాశాలల్లో అడుగు పెట్టగానే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉదయం ఇంట్లో భోజనం సిద్ధం కాకపోవడంతో హడావుడిగా తినకుండా బయలు దేరి సాయంత్రం ఇంటికి వెళ్లే వరకు ఆకలితో అలమటిస్తున్నారు. బయట హోటల్‌లో భోజనం చేసే స్థోమత లేక పస్తులుండాల్సిన పరిస్థితి వారిది. కొందరు టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటున్నా మిగతా వారు ఇంటికి వెళ్లకుండా, తినకుండానే పాఠాలు వింటున్నారు.

అమలు కాని పథకం..

ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ అమలు చేయలేదు. ఈ ప్రకటనతో చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరారు. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు కట్టే స్థోమత లేని చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరుతుంటారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని గత ప్రభుత్వం అమలు చేయకపోవడంతో విద్యార్థులకు ఆకలి తిప్పలు తప్పడం లేదు. భోజనానికి అయ్యే ఖర్చుకు సంబంధించి గత ప్రభుత్వం కళాశాలల నుంచి ప్రతిపాదనలు సైతం స్వీకరించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి కళాశాలల్లో సైతం మధ్యాహ్న భోజనం అమలు చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

కళాశాలలో 750 మందికి పైగా విద్యార్థులు..

కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, వొకేషనల్ గ్రూపులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి మొత్తం 750 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. దూరప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లోని కళాశాలలకు ఉదయాన్నే వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందకపోవడంతో చాలా మంది ఒంటి పూట తరగతులకు హాజరవుతున్నారు. దీంతో హాజరు, సామర్థ్యం, ఫలితాలపై ప్రభావం పడుతోంది. కళాశాలల్లో చదువుకునేందుకు విద్యార్థులు సైకిళ్లపై, ఆర్టీసీ బస్సుల్లో, ఆటోల్లో వెళ్తుంటారు. చాలా వరకు విద్యార్థులు 15 కిలోమీటర్ల దూరం నుంచి కళాశాలకు వస్తున్నారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటల వరకు ఇళ్లకు చేరుతున్నారు. కళాశాలకు టిఫిన్ బాక్స్‌లు తీసుకెళ్లకుండా పాఠాలు వినడంతో నీరసించిపోతున్నారు.

మధ్యాహ్న భోజనం పెట్టాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టించాలి. మధ్యాహ్నం ఆకలితో అలమటిస్తున్నాం. ఇంటి నుంచి వచ్చే సమయానికి వంట కావడం లేదు. కళాశాల నుంచి ఇంటికి వెళ్లాలంటే ఆలస్యమవుతుంది. వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి నిరుపేద విద్యార్థుల ఆకలి తీర్చాలి.

- కల్పన, విద్యార్థిని

ఆకలితో చదువుకుంటున్నాం



ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ అమలు చేయలేదు. దీంతో ఆకలితో చదువుకుంటున్నాం. నిరుపేద విద్యార్థులంతా ప్రభుత్వ కళాశాలల్లో జాయిన్ అవుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేసి విద్యార్థులకు సాయం చేయాలి.

- విఠల్, విద్యార్థి

కొలాం సంఘం మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

ఆసిఫాబాద్: కొలాం సంఘం మండల కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్రం భీము, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల బక్కయ్య, గౌరవ అధ్యక్షుడిగా టేకం కట్టిరావు, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా ఆత్రం ధర్మరాడి, మడావి గుండయ్య, సహాయ కార్యదర్శులుగా ఆత్రం పవన్, సిడాం ముగ్గ, కోశాధికారిగా ఆత్రం దేవురావు, సాంస్కృతిక కార్యదర్శిగా సిడాం భీమ్‌రావు, టేకం భీము, ప్రచార కార్యదర్శులుగా ఆత్రం భీమ్‌రావు, ఆత్రం భగవంత్‌రావులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.

రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టాలి


సర్వే పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి: పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిన రహదారులు, వంతెనల నిర్మాణాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బంబార, గోండుకొసార గ్రామాలకు వెళ్లే రహదారులకు చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఖిరిడి, బంబార, నవెగాం, సమేలా, బంబార, చౌపన్‌గూడ, ఎనోలి, ఖమాన తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల నిర్మాణం త్వరగా ప్రారంభించాలని, ప్రజల అవస్థలను దృష్టిలో పెట్టుకొని టెండర్ ప్రక్రియ పూర్తయిన రోడ్లు వర్షాకాలానికి ముందే పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట బంబార మాజీ సర్పంచ్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాలరాజు

సిర్పూర్(టి): 2024 –25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి మండలంలో ఆదివారం నిర్వహించిన గురుకులాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల డీపీఐపీ గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కాగజ్‌నగర్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు ప్రవేశ పరీక్ష కేంద్రాల్లో 912 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 854 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 58 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల కోఆర్డినేటర్ పి. బాలరాజు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యం

నార్నూర్: కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జాదవ్ రాంకిషన్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశిస్తే అదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. జిల్లాలో రిటైర్డ్ జనరల్ మేనేజర్‌గా సుదీర్ఘకాలంగా ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఏజెన్సీ మండలాలైన నార్నూర్, గాదిగూడలకు దాదాపు ఐదు సంవత్సరాలు ప్రత్యేకాధికారిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిందని ఆరోపించారు. ఎంపీగా అవకాశం ఇస్తే వంద శాతం గెలిచి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో నాయకులు జాదవ్ కైలాస్ నాయక్, మడవి లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ చౌహాన్ డిగాంబర్, రాథోడ్ దత్త రామ్, జాకిరుల్ల ఖాన్, షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట, కొమ్ముగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, డ్రెయినేజీ, రోడ్లు ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.కోటి అరవై లక్షలతో రోడ్ల నిర్మాణం కోసం ప్రారంభించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పింగళి రమేష్, నాయకులు చింత అశోక్, చిన్నన్న, నాగభూషణం, రాజు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న అజ్మీర శ్యాంనాయక్

రెబ్బెన: గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 24 వరకు జరగనున్న జాతర సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాం నాయక్ ప్రారంభించారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి వైపుల నుంచి జాతరకు తరలివచ్చే భక్తుల కోసం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ పక్క నుంచి ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లావుడ్య రమేశ్, దేవాజీ, సోమయ్య, గంటుమేర, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బెజ్జూర్: చౌకధరల దుకాణాల ద్వారా పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచగా పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న క్రమంలో మొగవెల్లి వద్ద పట్టుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేశారు. అలాగే ఎల్కపాలి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేయడంతో పాటు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నస్పూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి సూచించారు. సీసీసీ సింగరేణి పాఠశాల 46వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం కార్మికులకు వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సుకై అనేక మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. పాఠశాలలో రూ.5లక్షలతో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన మినీ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సేవా అధ్యక్షురాలు రాధా కుమారి, ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ అనూక్ మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు పాటలపై చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పట్టుదలతో ప్రభుత్వ కొలువులు


కుటుంబ సభ్యులతో దూపం రాకేశ్

- మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక
- యువతకు ఆదర్శంగా రాకేశ్

బెజ్జూర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఆషామాషీ కాదు. సర్కారు కొలువు కోసం వచ్చే నోటిఫికేషన్లు తక్కువ కాగా పోటీ చాలా ఎక్కువగా ఉంటుంది. పోటీని తట్టుకొని మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన యువకుడు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికి ఆదర్శంగా నిలిచాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామానికి చెందిన దూపం హన్మంతు –మంజుల దంపతుల కుమారుడు దూపం రాకేశ్ ఈ ఘనత సాధించాడు. రైల్వే గ్రూప్‌- డి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించగా, కానిస్టేబుల్ పరీక్ష రాసి జైల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం గ్రూప్‌–4 పరీక్షలో సైతం సత్తా చాటాడు. రాష్ట్ర వ్యాప్తంగా 2697వ ర్యాంక్ జిల్లాలో 17వ ర్యాంక్ సొంతం చేసుకున్నాడు.

సాధారణ కుటుంబం..

సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన దూపం రాకేశ్ తన తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ కొలువు సాధించేందుకు పట్టువీడని విక్రమార్కుడిలా సన్నద్ధమయ్యాడు. ఎంతో కష్టపడి చదివి చివరికి తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. రాకేశ్ సలుగుపల్లిలోని జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదివాడు. ఆ తర్వాత బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ విద్యాభ్యాసం పూర్తి చేశాడు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇందుకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకున్నాడు.

రాత్రింబవళ్లు కష్టపడ్డా..



పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమవుతుంది. తల్లిదండ్రుల ఆశయాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వ కొలువు సాధించాలని రాత్రింబవళ్లు కష్టపడ్డాను. హైదరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రతీరోజు స్టడీహాల్‌లో చదివాను. ఆన్‌లైన్‌లో తరగతులు విన్నాను. మూడు ప్రభుత్వ కొలువులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది.

-దూపం రాకేశ్

ఎమ్మెల్యే హరీశ్‌బాబు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా దాబా గ్రామంలోని సద్గురు కొండయ్య మహారాజ్ సమాధిని ఆదివారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సద్గురు కొండయ్య మహారాజ్ జయంతి సందర్భంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నిల్ అనుములవార్, నాయకులు నీలేష్ పుల్గంకర్, ఎల్ములు మల్లయ్య, చప్పిడి సత్యనారాయణ, మురళీ, ప్రవీణ్, భీమన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌- 4 స్టేట్ టాపర్‌కు సన్మానం


సన్మానిస్తున్న శిశుమందిర్ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్: ఇటీవల టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్‌–4 పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన శిశుమందిర్ పూర్వ విద్యార్థి శ్రీరాం శివకృష్ణను ఆదివారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో పాఠశాల కమిటీ ప్రతినిధులు సన్మానించారు. శివరామకృష్ణతో పాటు శిశుమందిర్‌లో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ, శ్రీవాణి దంపతులను సన్మానించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శివకృష్ణను శాలువాతో సన్మానించి, అభినందించారు. పాఠశాల కమిటీ అధ్యక్షులు చిలువేరు వెంకన్న, ప్రతినిధులు ముక్క కృష్ణమూర్తి, కోట వెంకన్న, దరిపెల్లి కృష్ణమాచార్యులు, కల్లూరి సంతోశ్, గుర్రాల హరిప్రియ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎం రవి ప్రసాద్

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను జీఎం కార్యాలయంలో జీఎం రవి ప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేస్తూ ఎస్టీలకు దక్కాల్సిన ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. ఏరియా నుంచి ఉత్తమ అధికారిగా ఎంపికైన ఏజీఎం తిర్మల్ రావును, ఖైరిగూడ ఓసీపీ నూతన ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్నలను ఘనంగా సన్మానించారు. పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, డీజీఎం ఫైనాన్స్ రామారావు, ఎస్టీ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు మంగీలాల్, అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటేశ్వర రావు, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, పార్వతి, కల్పన ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్యాలయం నిర్మాణ పనులు అడ్డగింత


అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారు అంజనేయ స్వామి విగ్రహం వెనక అటవీశాఖ అధికారులు నూతన కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించగా ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి కేటాయించిన స్థలంలో అక్రమంగా అటవీశాఖ అధికారులు అటవీ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారని వారు ఆరోపించారు. పెద్ద ఎత్తున యువకులు చేరుకొని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై కొమురయ్య అక్కడికి చేరుకొని యువకులను అక్కడి నుంచి పంపించారు. ఫారెస్టు రేంజ్ అధికారి సుధాకర్‌ను వివరణ కోరగా గతంలోనే అటవీశాఖ కార్యాలయం మంజూరైందని, అటవీశాఖ స్థలంలోనే నిర్మాణ పనులు ప్రారంభించినా గ్రామస్తులు అడ్డుకుంటున్నారన్నారు.